
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 26 । జూన్ । 2025



సోమశిలలో 34.080 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో బుధవారానికి 34.080 టీఎంసీలు ఉన్నాయి. 461 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 3,330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1,275 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,170
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,067
3 శాతం జీఎస్టీతో	రూ.9,339
నవర (8 గ్రా)	రూ.74,712

గరిష్టం/కనిష్టం
33.8 /29.6

వాతావరణం
జిల్లాలో గురువారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండి, వాతావరణం పొడిగా ఉంటుంది. బుధవారం గాలిలో తేమ 57 శాతంగా నమోదైంది.

సర్వేపల్లి మాఫియాల అడ్డా

పొదలకూరు, వెంకటాచలంలో విచ్చలవిడిగా తవ్వకాలు

చెప్పేవి నీతులు.. చేసేవి అవినీతి పనులు

గతంలో ప్రతిపక్షంలో ఉండీ అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండడంతో పోలీసులు అడ్డుకుని వాహనాలను స్టేషన్‌కు తరలిస్తే.. సదరు ముఖ్య నేత సాగించిన హడావుడి అంతాఇంతా కాదు. నిత్యం మీడియా ముందుకు వచ్చి తానేదో సత్యహరిశ్చంద్రుడు వారసుడైనట్లు.. నీతులు మాట్లాడుతుంటారు. కానీ చేసేవన్నీ అవినీతి పనులే. సదరు నేత అధికారం దక్కిన ఏడాది కాలంగా ఇసుక, మట్టి, గ్రావెల్, బూడిద, మద్యం, పేకాట, డైమండ్ డబ్బా వంటి మాఫియాలను బహిరంగంగా నడిపిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్య నేత మండలానికొక నేతను పెట్టుకుని ఏడాది కాలంలో రూ.వందల కోట్లు కొల్లగొట్టినట్లు అధికార పార్టీలోనే చర్చ జరుగుతోంది. ఆ ముఖ్య నేత అక్రమాలను ఏడాది కాలంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పక్కా ఆధారాలతో మీడియా సమావేశాల్లో బట్టబయలు చేస్తూ వచ్చారు. దీన్ని జీర్ణించుకోలేక కాకాణిపై తప్పుడు కేసులు పెట్టించి జైల్లో కూర్చొబెట్టి తన అవినీతి, అక్రమాలను విచ్చలవిడిగా సాగిస్తున్నారు.

- ముఖ్యనేత కనుసన్నల్లోనే చెలరేగుతున్న నేతలు
- ట్రిప్పు రూ.5 వేల నుంచి రూ.10 వేలు
- సాగరమాల ప్రాజెక్ట్ పేరుతో తరలిస్తున్న వైనం
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు

సర్వేపల్లి.. సహజ వనరుల సంపద దోపిడీ మాఫియాలకు అడ్డాగా మారింది. అధికారం చేజిక్కించుకున్నప్పటి నుంచి ఏడాది కాలంగా విరామం లేకుండా ఇసుక, మట్టి, గ్రావెల్ తవ్వకాలతో జిల్లాలోనే చరిత్ర సృష్టిస్తున్న ముఖ్య నేత కనుసన్నల్లో తాజాగా వైట్ క్వార్ట్జ్ తవ్వకాలను గిన్నిస్ రికార్డు స్థాయిలో చేపడుతున్నారు. పొదలకూరు, వెంకటాచలంలో విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నా.. అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. అక్రమంగా మైనింగ్, గ్రావెల్ తవ్వకాలు చేశారంటూ చేయని నేరాలకు మాజీమంత్రి కాకాణిపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టించి పైశాచికానందం పొందుతున్న టీడీపీ నేతలు వీరు సాగిస్తున్న ప్రకృతి సంపద దోపిడీకి ఎంత కాలం జైల్లో పెట్టాలని ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.



నాగబొట్లకండ్రిక వద్ద యథేచ్ఛగా యంత్రాలతో లోడేస్తున్న గ్రావెల్

సాక్షి టాస్క్‌ఫోర్స్: సర్వేపల్లి ముఖ్యనేత నిత్యం మాట్లాడేవి నీతులు.. చేసేవి అవినీతి పనులు అన్నట్లుగా ఉంది. నియోజకవర్గాన్ని ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియాలకు అడ్డాగా మార్చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయా సహజ వనరుల దోపిడీలో అధికార పార్టీ నేతలు ఒక ఉద్యమంగా సాగిస్తున్నారు. పొదలకూరు, వెంకటాచలం మండలాల్లో ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అక్రమంగా గ్రావెల్, మట్టిని తవ్వేసి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్క గ్రావెల్ మాఫియా రూ.కోట్ల గ్రావెల్ దందా సాగిస్తోందంటే ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా.. మైనింగ్, రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ముఖ్యనేత కనుసన్నల్లో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. అడ్డుకునేందుకు ప్రయత్నించే వారిపై అక్రమ కేసుల పేరుతో భయపెడుతుండడంతో కనీసం ఫిర్యాదులు చేసేందుకు ముందుకు రావడం లేదు.

నిత్యం వందల ట్రిప్పుల తరలింపు

సర్వేపల్లి నియోజకవర్గంలో పొదలకూరు, వెంకటాచలంలో నిత్యం నిరంతరాయంగా వందల ట్రిప్పుల గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పు డిమాండ్‌ను బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలు కూడా వసూలు చేస్తున్నారు. ముత్తుకూరు మండలంలో చేపడుతున్న సాగరమాల ప్రాజెక్ట్‌కు గ్రావెల్ అవసరం కావడంతో కొన్ని నెలలుగా వెంకటాచలం, పొదలకూరు మండలాల నుంచి నిత్యం సుమారు 200 ట్రిప్పులకుపైగానే గ్రావెల్‌ను తరలిస్తున్నారు. జోరు వర్షం కురిస్తే తప్పించి మిగిలిన రోజుల్లో పట్టపగలే యంత్రాలతో టిప్పర్లు పెట్టి గ్రావెల్, మట్టిని దోచుకుంటున్నారు. ప్రధానంగా వెంకటాచలం మండలం నాగబొట్లకండ్రిక గ్రామం నుంచి గ్రావెల్ తరలిస్తున్నారు.



గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

తాటిపర్తిలో 130 ఎకరాల్లో..

పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీ బత్తులపల్లిపాటు గ్రామంలో సర్వే నంబరు 26లో సుమారు 130 ఎకరాల ప్రభుత్వ, మేతపొరంబోకు భూములు ఉన్నాయి. తాటిపర్తికు చెందిన టీడీపీ నేతలు ఆ భూముల్లో రేయింబవళ్లు గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. యథేచ్ఛగా యంత్రాలను ఉపయోగించి పెద్ద గోతులను చేసి గ్రావెల్‌ను నెల్లూరుతోపాటు చుట్టు పక్కల లేఅవుట్లకు తరలిస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తే అధికారం పార్టీలో ఉన్నాము.. చూసీచూడనట్లు పోవాల్సిందేనని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ నుంచి నిత్యం 100 ట్రిప్పుల వరకు తరలిస్తున్నట్లు సమాచారం. గ్రావెల్ దోపిడీపై అడిగే వారిపై అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరింపులకు దిగుతున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఈ పంచాయతీలో ఇంటి అవసరాల కోసం సామాన్యులు రెండు ట్రాక్టర్ల గ్రావెల్ తోలుకుంటే పోలీసులకు పట్టించి కేసులు పెట్టించారు. ఇప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చెలరేగిపోతున్నారు.



బత్తులపల్లిపాడు సమీపంలో గ్రావెల్ తవ్వేస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ హయాంలో ఏ తప్పు లేకపోయినా..

గతంలో వైఎస్సార్‌సీపీ పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఏ నేత కూడా సహజ వనరుల అక్రమ దందాలకు పాల్పడలేదు. అయినా తాటిపర్తి పంచాయతీలో రుస్తుం మైన్‌లో అక్రమంగా మైనింగ్ చేయించారంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టించారు. బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు తాజాగా సర్వేపల్లి రిజర్వాయర్‌లో అక్రమంగా గ్రావెల్ తవ్వారని మరో కేసు నమోదు చేయించారు. ఆ కేసుకు సంబంధించి కాకాణిని పోలీసు కస్టడీకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వాస్తవంగా సర్వేపల్లి నియోజకవర్గంలో అక్రమంగా గ్రావెల్, మట్టి, మైనింగ్ జరిగి ఉంటే అధికార పార్టీ సదరు ముఖ్య నేత వీరంగం చేసేవారు. ట్రాక్టర్ గ్రావెల్ తరలించినా.. తట్టెడు మట్టి తవ్వినా మైనింగ్ శాఖ అనుమతుల మేరకే తవ్వడంతో ఎక్కడా అక్రమ దందాలు చేసినట్లు ఆధారాలు లేకపోవడంతో మౌనంగా ఉండిపోయారు. అధికారం రాగానే అక్రమాలు జరగకపోయినా.. అక్రమాలు చేశారంటూ ఊదరగొట్టుతున్నారు.

మొదటి రోజు కాకాణి విచారణ పూర్తి

నెల్లూరు (లీగల్): మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని సిట్ అధికారి ఆధ్వర్యంలో మొదటి రోజు విచారణ పూర్తయింది. సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించారని నమోదు చేసిన అక్రమ కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కాకాణిని కోర్టు అనుమతితో సిట్ అధికారులు రెండు రోజుల విచారణ నిమిత్తం సిట్ అధికారులు బుధవారం కృష్ణపట్నం పోర్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. న్యాయవాది సిద్దన సుబ్బారెడ్డి సమక్షంలో గోవర్ధన్‌రెడ్డిని బాపట్ల సిట్ అధికారి రామాంజనేయులు 30 ప్రశ్నలు అడిగారు. మధ్యవర్తులు వెంకటాచలం మండలం ఇడిమేపల్లికి చెందిన దేవరపాటి నాగేంద్రబాబు, కురిచెర్లపాడుకు చెందిన వినయ్ సమక్షంలో విచారణ జరిగింది. అనంతరం సాయంత్రం 5 గంటలకు కాకాణిని జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

బెడిసి కొట్టిన టీడీపీ దొంగల కట్టు కథ

- దొంగతనం చేసి పారిపోయే యత్నంలో రోడ్డు ప్రమాదం
- యువకుడి మరణానికి కారణం
- టీడీపీ నేతల ఒత్తిడితో చోరీ కేసు నమోదులో జాప్యం
- కేసుల్లేకుండా రూ.5 లక్షల వరకు బేరాలు
- ఎట్టకేలకు ప్రమాదంతోపాటు చోరీ కేసు నమోదు



చోరీ చేసి వాహనంలో తెస్తున్న మోటారు



మృతుడు సుధీర్‌బాబు కుమారులు

కోవూరు: కోవూరు మండలం జమ్మిపాళెంలో మోటార్ చోరీ, రోడ్డు ప్రమాదానికి సంబంధించి టీడీపీ దొంగల కట్టు కథలు బెడిసి కొట్టాయి. ఆదివారం రాత్రి పడుగుపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు ప్రసాద్, మణి, శ్రీహరి, శ్రీనివాసులు కలిసి టాటా ఏస్ వాహనంలో జమ్మిపాళెంలోని జగనన్న కాలనీలో తాగునీటి పథకానికి ఏర్పాటు చేసిన మోటార్లను చోరీ చేసి పరారయ్యే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదానికి కారణమై ఓ యువకుడి దుర్మరణానికి బాధ్యులైన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటన జరిగిన నిమిషాల్లోనే నిందితులను కాపాడేందుకు షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న ఇందుకూరుపేటకు చెందిన ఓ ముఖ్య నేత సూచనలతో కోవూరుకు చెందిన టీడీపీ నేతలు పోలీస్‌స్టేషన్ ముందు వాలిపోయారు. నిందితులపై ఏ కేసు కట్టకుండా ఒక రోజంతా పోలీసులపై ఒత్తిడి తెచ్చారు.

ప్రమాద ఘటనపై బంధువుల విమర్శలతో..

ఈ ప్రమాదంలో నెల్లూరులోని ఓ షాపింగ్ మాల్లో క్యాషియర్‌గా పనిచేస్తున్న జమ్మిపాళెంకు చెందిన సుధీర్‌బాబు దుర్మరణం చెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన నిందితులు ఘటనా స్థలంలోనే తప్పించుకునే ప్రయత్నం చేశారు. సుధీర్‌బాబు డ్యూటీ ముగించుకుని స్వగ్రామం జమ్మిపాళెం వెళ్తున్న సమయంలో అతని బంధువులు ఓ ఫంక్షన్‌కు వెళ్లి వెళ్తున్నారు. వీరిని క్రాస్ చేసి సుధీర్‌బాబు ముందుగా వెళ్లిపోయాడు. అయితే నిందితులు అదే గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో తాగునీటి మోటార్లు చోరీ చేసి స్థానికుల కంట పడడంతో వాహనంతో సహా పారిపోయే ప్రయత్నంలో మితిమీరిన వేగంతో వస్తూ ఎదురుగా బైక్‌పై వస్తున్న సుధీర్‌బాబును ఢీకొన్నారు. దీంతో సుధీర్‌బాబు రోడ్డుపై పడిపోవడంతో నిందితులు ఆగి అతన్ని పరిశీలిస్తున్నారు. ఇంతలోనే వెనుకనే వచ్చిన అతని బంధువులు వచ్చి చూసి అడగడంతో ముందు వెళ్లిన ఏదో వాహనం ఢీకొట్టి వెళ్లిపోయిందని, తాము ఆగి చూస్తున్నామంటూ బుకాయించారు. దీంతో వారి బంధువులు సుధీర్‌బాబు మమ్మల్ని క్రాస్ చేసి కొన్ని క్షణాలు ముందే వచ్చాడు. మాకు ఎదురుగా ఏ వాహనం రాలేదు. మీరే ఢీకొట్టి నాటకాలు ఆడుతున్నారంటూ నిలదీయడంతో వారి నుంచి తప్పించుకుని పరారయ్యారు. ఈ ఘటన తర్వాత కోవూరుకు చెందిన టీడీపీ నేతలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కేసు నమోదు కాకుండా ప్రైవేట్ పంచాయితీ నడిపారు. బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు ఇస్తామని బేరం పెట్టారు. అయితే బాధిత కుటుంబ బంధువులు రూ.30 లక్షల డిమాండ్ చేశారు. చివరకు టీడీపీ నేతలు రూ.5 లక్షల వరకు ఇపిస్తామని బేరసారాలు చేశారు. అయితే ఈ పంచాయితీ తెగకపోవడంతో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసి పోలీసులు చేతులు దులుపుకున్నారు. దొంగతనం కేసు అయితే నమోదు చేయలేదు. నిందితులు మొదట చోరీ చేసి, ఆ తర్వాత రోడ్డు ప్రమాదానికి కారణమైనట్లు మీడియాల్లో కథనాలు రావడంతో పోలీసులు చోరీ కేసు కట్టడం గమనార్హం.

ఎవరికి వారు టీడీపీ నేతలు సైలెంట్

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి దుర్మరణానికి కారణమైన నిందితులు టీడీపీ వర్గీయులు కావడంతో షాడో ఎమ్మెల్యే ప్రోద్బలంతో కోవూరుకు చెందిన టీడీపీ నేతలు నిమిషాల వ్యవధిలోనే పోలీస్‌స్టేషన్ ముందు వాలిపోయారు. అయితే టీడీపీ నేతలు దొంగల ముఠాకు, రోడ్డు ప్రమాదానికి కారణమైన నిందితులకు కొమ్ము కాస్తున్నారని ప్రచారం జరగడంతో ఎవరికి వారు సైలెంట్ అయిపోయారు.

తండ్రిని కోల్పోయిన బిడ్డలను ఆదుకోవాలి

టీడీపీకి చెందిన దొంగల ముఠా చేసిన రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన సుధీర్‌బాబు బిడ్డల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. తల్లి గృహిణిగా ఉండగా, నాన్నమ్మ అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తుండగా అరకొర వేతనం వస్తోంది. ఆమె కూడా మరో రెండు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత ఆ కుటుంబం బతుకుదెరువు పరిస్థితి ఏమిటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ చిన్నారులను ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రైతు పొలంలో మోటార్లు అంటూ..

రోడ్డు ప్రమాదానికి కారణమై పట్టుబడిన వాహనంలో చోరీ చేసిన మోటారు ఉండడంతో మరో కట్టుకథ అల్లారు. జమ్మిపాళెం సమీపంలో ఓ రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేస్తున్నామని, మోటారు రిపేరు కావడంతో తీసుకెళ్తున్నామంటూ బుకాయించే ప్రయత్నం చేశారు. సదరు రైతును అదే విషయాన్ని చెప్పాలని ఒత్తిడి చేశారు. వాస్తవానికి నిందితులు జగనన్న కాలనీలోని తాగునీటి పథకం మోటారు చోరీ చేయడం, దీనికి సంబంధించి సమాచారం ఉండడంతో టీడీపీ నేతలు చెప్పినట్లు చెబితే చివరకు తన మెడకు చుట్టుకుంటుందని భావించిన సదరు రైతు అసలు విషయాన్ని పోలీసులకు చెప్పేశాడు. ఈ క్రమంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ ఏఈ ఏకాంబరం కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులపై మంగళవారం రాత్రి ఎట్టకేలకు చోరీ కేసు కూడా నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో జిల్లా నేతలు







మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో జిల్లా నేతలు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తూమాటి మాధవరావు, మేరిగ మురళి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, బుర్రా మధుసూదన్‌రావు, మేకపాటి విక్రమ్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

– నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో పదవులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నాయకులకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తున్నట్లు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర ఆర్టీఐ వింగ్ జనరల్ సెక్రటరీగా దువ్వూరు మధుసూదన్‌రెడ్డి (గూడూరు నియోజకవర్గం), కార్యదర్శులుగా పూనూరు మనోహర్‌రెడ్డి (ఆత్మకూరు నియోజకవర్గం), ముమ్మారెడ్డి రవీంద్రరెడ్డి (సూళ్లూరుపేట నియోజకవర్గం), పి.సదానందరెడ్డి (వెంకటగిరి నియోజకవర్గం), రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధిగా ఎండీ మగ్దుమ్ మొహిద్దీన్ (గూడూరు నియోజకవర్గం)లను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

- నెల్లూరు(టౌన్): పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ పీజీ సెట్ ఫలితాలు బుధవారం విడుదల చేశారు. 1,022 మంది దరఖాస్తు చేసుకోగా 845 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 756 మంది అర్హత సాధించారు.

న్యూస్‌రీల్

పెన్నా కాలుష్యంపై అధికారుల పరిశీలన



పెన్నాను పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ వద్ద పవిత్ర నది జలాలు కలుషితమవుతున్న విషయమై స్థానికుడు మధు ఎన్‌జీటీకి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఎన్‌జీటీ బృందం, ఏపీ పొల్యూషన్ బోర్డు అధికారులు, స్థానిక అధికారులు బుధవారం పరిశీలన చేశారు. నెల్లూరు ఆర్డీఓ అనూష మాట్లాడుతూ ఎన్‌జీటీ బృందం నదిలో మురుగునీరు కలుస్తున్న మూడు ప్రదేశాలను గుర్తించి వాటర్ శాంపిల్స్ సేకరించామని, వాటిని ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. రిపోర్టు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎన్‌జీటీ చెన్నై రీజినల్ డైరెక్టర్ వరలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న చెస్ ఓపెన్ టోర్నమెంట్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా అండర్–15 చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 29వ తేదీ రాంజీనగర్‌లోని రోయ చెస్ అకాడమీలో ఓపెన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, 2010 జనవరిలో జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ ఈ నెల 27గా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9603345326 నంబరుకు ఫోన్ చేసి సమాచారం పొందాలన్నారు.

జాతీయ లోక్‌అదాలత్, విచారణ ఖైదీలపై సమీక్ష



జిల్లా అధికారుల కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్): జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్, విక్టిమ్ కాంపెన్‌జేషన్ స్కీం అమలు, విచారణ ఖైదీల సమస్యలు తదితర సమస్యలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా అధికారుల కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జిల్లా కోర్టులో జరిగింది. జిల్లా అధికారులు సూచనలు, సలహాలపై కో ఆర్డినేషన్ కమిటీలో చర్చించారు. కలెక్టర్ ఆనంద్, ఏఎస్పీ సౌజన్య, కార్పొరేషన్ కమిషనర్ నందన్, తిరుపతి డీఆర్‌ఓ నరసింహులు, నెల్లూరు కేంద్ర కారాగార సూపరింటిండెంట్ సన్యాసిరావు, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటిండెంట్ మస్తానయ్య, ఫారెస్ట్, ఎక్సైజ్, ఎలక్ట్రిసిటీ, బ్యాంకు మేనేజర్లు, చిట్ ఫండ్స్ కంపెనీ మేనేజర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు జడ్జిలు, ప్యానల్ లాయర్స్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ఐటీడీఏ ప్రథమ కర్తవ్యం

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి



నెల్లూరు రూరల్: జిల్లాలో ఆధార్, రేషన్ కార్డులు లేని గిరిజనులకు వచ్చే ఆగస్టు 15 లోపు వాటిని అందిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. మారుమూల పల్లెల్లో తాగు, సాగునీరు, మౌలిక వసతుల కల్పన ఐటీడీఏ ప్రథమ కర్తవ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గిరిజనాభివృద్ధికి గతేడాది రూ.1,300 కోట్ల నిధులు వ్యయం చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా 206 రోడ్లకు రూ.550 కోట్ల నిధులు వ్యయం చేశామన్నారు. కావలి, తిరుపతి జిల్లా కేపీపల్లి గురుకుల పాఠశాలల అభివృద్ధికి దాదాపు రూ.18 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. రాష్ట్రంలోని ప్రతి అంగన్‌వాడీలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.లక్ష నిధులు మంజూరు చేశామన్నారు. రాష్ట్రంలోని 6,800 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడంతో ప్రత్యేక టీచర్, ఆయాలను నియమిస్తున్నామన్నారు. అనంతరం మంత్రి కలెక్టర్‌తో కలిసి గిరిజన సంక్షేమ విద్యార్థులకు కాస్మోటిక్ కిట్లు, అంగన్‌వాడీ సిబ్బందికి స్టడీ మెటీరియల్, సామగ్రిని అందజేశారు. అనంతరం అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన బాలిక చెంచమ్మను పరామర్శించి, రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్కా.. నేను చనిపోతున్నా..

- ఆత్మహత్యకు ముందు వీడియోకాల్ చేసిన తమ్ముడు

నెల్లూరు సిటీ: చనిపోతున్నానంటూ అక్కకు తమ్ముడు వీడియోకాల్ చేసి బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు కథనం మేరకు.. రూరల్లోని కొండ్లపూడి టిడ్కో గృహంలో వి.శ్రీహరి (25) నివాసముంటున్నాడు. ప్లంబిగ్ వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పుల్లో కూరుకుపోయాడు. దీంతో కొంత కాలంగా శ్రీహరి కారు డ్రైవర్‌గా వెళ్తున్నాడు. అప్పుల బాధను తాళలేక ఆత్మహత్య చేసుకోవాలని అతను నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం తన అక్కకు వీడియోకాల్ చేసి బతకాలని లేదని, చనిపోతానని చెప్పాడు. ఆందోళనకు గురైన ఆమె తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. అతను ఇంటికి చేరుకుని తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లగా శ్రీహరి అప్పటికే ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి చూడగా చనిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారును తప్పించబోయి..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీనివాసులు (ఫైల్)

దుత్తలూరు : ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి పక్కనే ఉన్న రాళ్లగుట్టపై పడటంతో తీవ్ర గాయాలై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని వెంగనపాళెం – తిమ్మాపురం రోడ్డు మార్గంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు బుధవారం వివరాలు వెల్లడించారు. వెంగనపాళేనికి చెందిన పోలుబోయిన శ్రీనివాసులు (55) మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలోని గొర్రెల మంద వద్దకు మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. తిమ్మాపురం వైపు పొలాల్లోకి వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారును తప్పించబోయాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పడంతో పక్కనే ఉన్న రాళ్లగుట్టపై పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని హుటాహుటిన వింజమూరు వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు.

కండలేరులో 34.433 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 34.433 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,580, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆగిన నిధులు.. నత్తనడకన పనులు


ఈ చిత్రంలో కనిపించేది ఉదయగిరి ఆనకట్ట. గ్రామ కొలను కార్యక్రమం కింద దీని అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.15 కోట్ల నిధులు మంజూరు చేశారు. దాదాపు 60 శాతం పనులు చేశారు. ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఎస్టిమేషన్ కాస్ట్ రూ.9.45 కోట్లకు కుదించింది. చేసిన పనులకు ఇంత వరకు బిల్లులు ఇవ్వలేదు. కొత్తగా పనులు చేపట్టలేదు. ఆగస్ట్ నెల కల్లా పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హామీ ఇచ్చినా ఇంతవరకు ఆ దిశగా చర్యల్లేవు. దీంతో ఉదయగిరి పట్టణవాసులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

- గత ప్రభుత్వంలో 'గ్రామ కొలను'కు శ్రీకారం
- వేగంగా జరిగిన పనులు
- బిల్లులు నిలిపి వేసిన కూటమి ప్రభుత్వం
- గ్రామ పుష్కరిణిగా పేరు మార్చి చేతులు దులుపుకొన్న వైనం
- ఆగిపోయిన చెరువుల అభివృద్ధి


అరకొరగా జరిగిన చాకలకొండ గ్రామ కొలను పనులు

ఉదయగిరి: గ్రామాల్లో చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'గ్రామ కొలను' పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జాతీయ ఉపాధి హామీ నిధులతో మండలానికి ఒకటి చొప్పున చెరువును ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. మొత్తం 37 మండలాల్లో 37 చెరువులతో పాటు కొన్ని మండలాల్లో అదనంగా మరో 10 చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించారు. దీంతో వేగంగా పనులు జరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పథకం పేరును 'గ్రామ పుష్కరిణి'గా మార్చింది. కానీ జరిగిన పనులకు బిల్లులు ఇవ్వలేదు. కొత్తగా పనులు చేపట్టలేదు.

నేపథ్యం ఇదీ

2022లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ కొలనుకు శ్రీకారం చుట్టింది. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని జిల్లాలో 45 చెరువులను ఎంపిక చేశారు. వీటి అభివృద్ధి కోసం రూ.64.37 కోట్లకు పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చారు. సుమారు 50 శాతం చెరువుల పనులు ప్రారంభించారు. కొన్నిచోట్ల తుది దశకు చేరుకున్నాయి. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అయినా చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో కాంట్రాక్టర్లు తీవ్ర నష్టపోయారు. మొదలు కానీ పనులను రద్దు చేశారు.

> **నిధుల సమస్య ఉంది**
>
> జిల్లాలో 45 చెరువులను ఆధునీకరించేందుకు గుర్తించాం. వీటిలో గత ప్రభుత్వంలో కొన్ని పనులు చేశారు. వాటికి కూడా ఇంత వరకు బిల్లులు రాలేదు. ప్రస్తుతం నిధుల సమస్య ఉంది. నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.
>
> – దేశ్ నాయక్, ఎస్ఈ, ఇరిగేషన్

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు వేధింపులు

- కక్ష తీరకుంటే నాపై కేసులు పెట్టండి
- కాకాణి పూజిత


రమణారెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన పూజిత, నాయకులు, కార్యకర్తలు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తమను అధికార పార్టీ వారు వేధింపులకు గురిచేయడంతోపాటు అక్రమ కేసులు పెడుతున్నట్టు వెల్లడిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత అన్నారు. బుధవారం ఆమె పొదలకూరు విఘ్నేశ్వరాలయం, శివాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సంగంరోడ్డు సెంటర్‌లో ఉన్న తన తాత రమణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు పీటీ వారెంట్లు పెట్టి జైల్లోనే ఉంచాలని చూస్తున్నారని, ఇందుకోసం అమాయకులైన పార్టీ నాయకులు, కార్యకర్తలను కూడా విడవకుండా కేసులు బనాయిస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలుంటే తనపై కేసులు పెట్టుకోవాలని ఎలాంటి సంబంధం లేని కార్యకర్తల జోలికి మాత్రం వెళ్లొద్దన్నారు. తమను నమ్ముకున్న వారిని వేధింపులకు గురిచేస్తే అండగా నిలబడి ఎంత దూరమైన వెళతామన్నారు. గోవర్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు మీరు చేస్తే ప్రజలు ఆదరిస్తారని కేసులు పెట్టుకుంటూ పోతే అధికారం శాశ్వతంగా కాదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, మాజీ సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ రత్నమ్మ, ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన్‌గౌడ్, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, ఎస్‌కే అంజాద్, కేతు రామిరెడ్డి, నాయకులు బొడ్డు మాలకొండారెడ్డి, పి.అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణే లక్ష్యం

- ఎస్పీ కృష్ణకాంత్


మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు సిటీ: నేర నియంత్రణే లక్ష్యంగా పని చేయాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం ఎస్పీ నిర్వహించారు. దీనిని ఏపీ ఎస్పీ బెటాలియన్స్ ఐజీ బి.రాజకుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ డ్రోన్లు, సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధనను వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా పురోగతి సాధించిందని అభినందించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యే కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. పెండింగ్ కేసులు తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు కృషి చేయాలన్నారు. స్టేషన్ పరిధిల్లో మిస్సింగ్ కేసులు ఛేదనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ, రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరు, మహిళా పీఎస్, ఏఆర్ డీస్పీలు, అన్ని సర్కిళ్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు


ధర్నా చేస్తున్న సర్వేయర్లు

ప్రభుత్వ తీరుకు నిరసనగా ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం గ్రామ రెవెన్యూ సహాయకులు, సచివాలయ సర్వేయర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేశారు.

నెల్లూరు(అర్బన్): గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ)కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అలాగే ఇతర సమస్యలు పరిష్కరించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలువురు వీఆర్‌ఏలు ఆందోళన నిర్వహించారు. బుధవారం నెల్లూరులోని వీఆర్సీ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం ధర్నా జరిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ వీఆర్‌ఏలు రెవెన్యూ శాఖలో అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నట్లు చెప్పారు. సెలవులు లేకుండా ఫుల్‌టైమ్ పనిచేస్తున్నా పార్ట్‌టైమ్ పేరుతో గౌరవ వేతనం ఇచ్చి సరిపెట్టడం దుర్మార్గమన్నారు. వీఆర్‌ఏల్లో దాదాపు 90 శాతానికి పైగా దళితులు, గిరిజనులు, ఇతర బలహీనవర్గాల వారేనన్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఒక్క డీఏను కూడా ఆపేయడం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్న విధంగా టైమ్ స్కేల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఇంటర్వ్యూ చేసి ఆపేసిన 32 మందికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయకుమార్‌కి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లచ్చయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుర్గయ్య, భాస్కర్, సుబ్బయ్య, అంకయ్య, అమీర్, ఓబులేసు, షమీం, శీను, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్ల పెన్‌డౌన్

నెల్లూరు రూరల్: సమస్యలపై వినతిపత్రాలు సమర్పించినా పరిష్కారం చూపకపోవడంతో పెన్‌డౌన్ చేసి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని సచివాలయ సర్వే ఉద్యోగులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ ఆదేశాల మేరకు రాష్ట్రాధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు బీద లక్ష్మణానంద, వర్కింగ్ ప్రెసిడెంట్ అంకయ్య ఆధ్వర్యంలో ఉద్యోగులు నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టాలన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియను సీనియారిటీ ప్రతిపాదికన చేయాలన్నారు. ఫారెస్ట్‌లో, ముళ్లపొదల్లోకి వెళ్లి సర్వే చేస్తే రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. గ్రామస్థాయి ఉద్యోగులకు సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రొబెషనరీ డిక్లేర్ కాకుండా ఇప్పటి వరకు రూ.15 వేల జీతంతో పనిచేస్తున్న ఉద్యోగులను తక్షణం రెగ్యులర్ చేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సూచనల మేరకు సర్వేయర్లందరూ 27వ తేదీ వరకు మాస్ క్యాజువల్ సెలవు పెట్టారన్నారు. మిగిలిన రెండు రోజులు విజయవాడలో జరిగే రిలే నిరాహారదీక్షలకు హాజరవుతామని తెలియజేశారు.

వారిపై కఠిన చర్యలు తీసుకోండి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


బాలికను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. అపోలో హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఇందుకూరుపేట మండలానికి చెందిన బాలికను చైర్‌పర్సన్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్ దొంగతనం చేసిందనే అనుమానంతో బాలికను చిత్రహింసలకు గురి చేయడం హేయమైన చర్య అన్నారు. మనం ఏ సమాజంలో ఉన్నామని ప్రశ్నించారు. అధునాతన టెక్నాలజీతో ముందుకెళ్తుంటే కొందరు మూఢనమ్మకాలు పాటిస్తున్నారన్నారు. ప్రజల్లో పూర్తిస్థాయిలో చైతన్యం రావాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీఓలు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో కూటమి విఫలం


మాట్లాడుతున్న బాబూరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నెల్లూరు ప్రాంత కార్యకర్తల వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు సంబరాలు చేసుకునే బదులు ఆత్మ పరిశీలన చేసుకుంటే భవిష్యత్‌కు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గతంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తే ధ్వంసం చేయాలని చెప్పిన చంద్రబాబు, లోకేశ్‌లు నేడు రాష్ట్రంలో అదానీకి మేలు చేకూర్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు గతంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ కోర్టులో కేసులు కూడా వేశారని గుర్తు చేశారు. అమరావతి పేరుతో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను నిలిపి వేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు మూలం రమేష్, మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భర్త తీరు వల్లే భార్య ఆత్మహత్య

- బలవన్మరణం కేసులో బంధువుల ఆరోపణ
- భర్త వీడియోకాల్‌లో ఉండగానే ఉరేసుకున్నట్లు వెల్లడి
- అతను టీడీపీ నేత, ఉప సర్పంచ్


ఎస్సైతో వాదిస్తున్న మృతురాలి సోదరుడు

ఆత్మకూరు: పట్టణానికి చెందిన గొట్ల ప్రణవి (24) అనే వివాహిత భర్త తీరు వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. కాగా ప్రణవి భర్త, టీడీపీ నాయకుడు, దేవరాయపల్లి గ్రామ ఉప సర్పంచ్ అయిన గొట్ల మస్తానయ్య, అతడితో అక్రమ సంబంధం కొనసాగించిన మహిళను అరెస్ట్ చేయాలంటూ మృతురాలి సోదరుడు, సమీప బంధువులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ఆస్పత్రి గేటు వద్ద నిలిపి వారిని అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. ఎస్సైలు, పోలీసులు శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మస్తానయ్య తన ప్రియురాలితో కలిసి ఉండగా వీడియో కాల్ ద్వారా భార్య ప్రణవికి చూపుతూ మానసికంగా హింసించాడని బంధువులు ఆరోపించారు. ఆ సమయంలో భర్త చూస్తుండగానే ప్రణవి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. అయితే మస్తానయ్య ఏమీ తెలియనట్టు తన నివాసం పక్కనున్న వారికి ఫోన్లు చేశాడని, ప్రణవి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, చూసి చెప్పాలంటూ నటించాడన్నారు. కేసు నమోదు విషయంలో ఎలాంటి సంబంధం లేని మృతురాలి అత్త, ఆడపడచుల పేర్లను నమోదు చేయడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల ప్రమేయంతో మస్తానయ్యను అరెస్ట్ చేయలేదన్నారు. పోలీసులు వారికి సర్దిచెప్పి పంపారు.

7 సవర్ల బంగారం, రూ.30 వేల నగదు చోరీ

అల్లూరు: 7 సవర్ల బంగారం, రూ.30 వేల నగదును చోరీ చేసిన ఘటన అల్లూరు అన్నదాతవారి వీధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. ఆ వీధిలో షేక్ యాతిఫ్ బాడుగ ఇంట్లో ఉంటున్నాడు. ఈనెల 19వ తేదీన తిరుపతిలో తన బంధువుల పెళ్లికి వెళ్లి మంగళవారం రాత్రి ఇంటికొచ్చాడు. అప్పటికే తలుపులు పగులగొట్టి ఉన్నాయి. బంగారం, నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.8

